
సాక్షి గుంటూరు

గురువారం । 7 । ఆగస్టు । 2025



ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

బాపట్ల అర్బన్: ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని బీసీ సంక్షేమశాఖ డీడీ శివలీల పేర్కొన్నారు. ఈస్ట్ బాపట్ల గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య నిర్వహణను బుధవారం పరిశీలించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 587.70 అడుగులకు చేరింది. ఇది 305.9222 టీఎంసీలకు సమానం.



కొండలమ్మ ఆదాయం రూ.17.75 లక్షలు

గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మవారి దేవస్థానంలో హుండీల్లోని కానుకలను బుధవారం లెక్కించగా రూ.17,75,841 వచ్చాయి.

న్యూస్‌రీల్

నేడు మంగళగిరిలో సీఎం పర్యటన



మంగళగిరి టౌన్: మంగళగిరి నగర పరిధిలోని ఆటోనగర్‌లో ఉన్న వీవర్స్ శాల వద్ద జరుగనున్న జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమానికి గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం జిల్లా అధికారులు ఏర్పాట్లను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ వీవర్స్ శాల ఎదురుగా ఏర్పాటు చేయనున్న ప్రజావేదిక వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో చర్చించారు. వారికి పలు సూచనలు చేశారు. సంయుక్త కలెక్టర్ భార్గవతేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజన సింహ, ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా, అడిషనల్ ఎస్పీ రవికుమార్, డీఎఫ్ఓ కృష్ణారెడ్డి, హ్యాండ్‌లూమ్ అండ్ టెక్స్‌టైల్స్ జేడీ రాజారావు, మంగళగిరి తహసీల్దార్ దినేష్ రాఘవేంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అక్టోబరులో కృత్రిమ చేతులు పంపిణీ




మంగళగిరి టౌన్: మంగళగిరి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అక్టోబర్ నెలలో ఉచిత కృత్రిమ చేతులు పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు క్లబ్ అధ్యక్షులు ప్రగడ రాజశేఖర్ తెలిపారు. మంగళగిరి నగర పరిధిలోని వీటీజేఎం డిగ్రీ కళాశాలలో బుధవారం దీనికి సంబంధించి గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ అక్టోబర్ 13 నుంచి 17వ తేదీ వరకు డిగ్రీ కళాశాలలో ఈ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. అధునాతన సాంకేతికతతో జర్మనీ దేశంలో కృత్రిమ చేతులు తయారు చేయించి ఉచితంగా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రోటరీ డిస్ట్రిక్ట్ 3150 గవర్నర్ రామ్‌ప్రసాద్, ప్రాజెక్టు డైరెక్టర్ అనిల్ చక్రవర్తి, అన్నే రత్నప్రభాకర్, సెక్రటరీ నిరంజన్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

సంగీత, నృత్య కోర్సుల్లో ప్రవేశాలకు ఆహ్వానం

నగరంపాలెం: డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి పలు కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ విష్ణుభట్ల కృష్ణవేణి తెలిపారు. గుంటూరు అశోక్‌నగర్ ఒకటో వీధిలోని పాఠశాలలో బుధవారం సాయంత్రం విలేకర్ల సమావేశంలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. కర్ణాటక గాత్రం, వీణ, వయోలిన్, డోలు, మృదంగం, కూచిపూడి నృత్యం, నాదస్వరం విభాగాలలో నాలుగేళ్ల సర్టిఫికెట్ కోర్సు, రెండేళ్ల డిప్లొమా కోర్సు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. వయోపరిమితి లేదని పేర్కొన్నారు. వివరాలకు పాఠశాల లోగానీ, 0863 – 2234913 ఫోను నంబర్ లోగానీ సంప్రదించాలని కోరారు.

పశ్చిమ డెల్టాకు 8,004 క్యూసెక్కులు విడుదల



దుగ్గిరాల: విజయవాడ ప్రకాశం బ్యారేజ్ నుంచి 8,004 క్యూసెక్కులు బుధవారం విడుదల చేసినట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజ్ వద్ద 12 అడుగులు నీటి మట్టం ఉంది. దుగ్గిరాల సబ్ డివిజన్ హైలెవెల్ కాలువకు 300, బ్యాంక్ కెనాల్‌కు 1,917, తూర్పు కాలువకు 722, పశ్చిమ కాలువకు 286, నిజాంపట్నం కాలువకు 463, కొమ్మూరు కాలువకు 3,160, బ్యారేజ్ నుంచి సముద్రంలోకి 25,375 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

8న జిల్లా స్థాయి ఫుట్‌బాల్ పోటీలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు పేరేచర్ల క్రీడామైదానంలో సీనియర్ మెన్ జిల్లా స్థాయి పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు అధ్యక్ష, కార్యదర్శులు కుమ్మరి క్రాంతికుమార్, దుర్గా మోహన్‌లు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఎంపిక చేసిన జట్టును ఈ నెల 9వ తేదీన బాపట్లలో జరగనున్న నల్లమల జోన్ పోటీలకు పంపిస్తామని పేర్కొన్నారు. 96429 31771 ఫోను నంబర్‌లో సంప్రదించాలన్నారు.

కూటమిలో కాసుల పోరు

జిల్లాలో కూటమి నేతల మధ్య కాసుల కోసం ఆధిపత్యపోరు ఎక్కువైంది. తెలుగుదేశం, జనసేన నాయకుల మధ్య విభేదాలు పెరిగిపోయాయి. టీడీపీలోనూ ఒకరితో మరొకరికి పడటం లేదు. దీనికి డబ్బు సంపాదనే కారణం. సొంత పార్టీ నాయకులు, కార్యకర్తలను కూడా ప్రజాప్రతినిధులు వదలడం లేదు. తెలుగు తమ్ముళ్లు కూడా ఈ దెబ్బకు బెంబేలెత్తిపోతున్నారు.



- ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల మధ్య విభేదాలు
- డబ్బు వసూళ్లలో అందరూ బిజీ బిజీ
- సొంత పార్టీ వారినీ వదలని ప్రజాప్రతినిధులు
- ఇవ్వకుంటే అధికారులను ఉసిగొలిపి మరీ వసూళ్లు
- జిల్లాలో ప్రజాప్రతినిధుల తీరుపై సర్వత్రా విమర్శలు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: అధికారమే అండగా కూటమి ప్రజాప్రతినిధులు చెలరేగిపోతున్నారు. దొరికినకాడికి దోచుకుందామనే ధోరణితో వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో తమ, పర అనే భేదాలు లేకుండా చిన్నాస్థాయి నాయకులు, కార్యకర్తల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారు. ఈ తీరు చూసి సొంత పార్టీల నేతలు, ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా సేవ పక్కన పెట్టి కాసుల కోసం కక్కుర్తి పడుతున్న తీరును ఖండిస్తున్నారు.

తెనాలిలో పచ్చగడ్డి వేస్తే భగ్గు

తెనాలిలో మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజా వర్గీయుల మధ్య సంబంధాలు లేవు. సీఎంఆర్ఎఫ్ డబ్బులు కూడా ఎవరి కార్యాలయంలో వారు చెక్కులు ఇచ్చుకుంటున్నారు. ఇక్కడ ఏకాభిప్రాయం కుదరకపోవడంతో పలు నామినేటెడ్ పోస్టులు ఇప్పటికీ భర్తీ చేయలేదు. వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ, వైకుంఠపురం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ వంటి నియామకాలు ముందుకు సాగడం లేదు. కార్పొరేషన్ డైరెక్టర్లు చెరొకటి ఇప్పించుకున్నారు. మంత్రి మనోహర్ తమకు పనులు చేయడం లేదంటూ తెలుగుదేశం పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు. టీడీపీ వారి ఫ్లెక్సీలలో మనోహర్ పేరు కూడా వేయడం లేదని ఆయన వర్గం మండిపడుతోంది. ఇసుక విక్రయాలకు సంబంధించి కమీషన్ల విషయంలో ఇరువురు పోటీ పడుతున్నారు. దీంతో మంత్రి మనోహర్ స్వయంగా వెళ్లి ఇసుక తరలింపును అడ్డుకున్నారు.

పొన్నూరులోనూ అదే తంతు

పొన్నూరులో మాజీ ఎమ్మెల్యే కిలారు రోశయ్య ఎన్నికలు కాగానే జనసేన పార్టీలో చేరిపోయారు. స్థానిక ఎమ్మెల్యే నరేంద్ర మాత్రం దీనికి అంగీకరించడం లేదు. రోశయ్యపై కేసులు పెట్టి వేధిస్తూనే ఉన్నారు. మరోవైపు జనసేనలో కూడా నియోజకవర్గంలో రెండు గ్రూపులు ఉన్నాయి. ఒకరిపై మరొకరు తీవ్ర ఆరోపణలు చేసుకుంటున్నారు. తెలుగుదేశం పార్టీ వారైతే దోపిడీకి సొంత పార్టీ నేతలనూ వదలబోమని నిరూపిస్తున్నారు. ఎమ్మెల్యే భర్త పక్క నియోజకవర్గంలో వెంచర్ వేస్తుంటే తమకు డబ్బులు ఇవ్వలేదని ఆ వెంచర్‌ను నాయకులు అడ్డుకున్న విషయం పార్టీలో తీవ్ర వివాదానికి దారి తీసిన సంగతి తెలిసిందే.

గుంటూరులో వసూళ్ల పర్వం

- గుంటూరు నగరంలోని స్వర్ణభారతి నగర్‌లో స్థలం కొనుక్కొని ఇల్లు కట్టుకుంటున్న తెలుగుదేశం డివిజన్ స్థాయి నేతకు నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధి కార్యాలయం నుంచి ఫోన్ వచ్చింది. నిబంధనలను అతిక్రమించి ఇల్లు కడుతున్నారని, ఒకసారి వచ్చి కలవాలని దాని సందేశం. సదరు నాయకుడు తనకున్న పరిచయాలతో మంత్రి అచ్చెన్నాయుడిని ఆశ్రయించి సదరు ప్రజాప్రతినిధికి ఫోన్ చేయించారు. మన పార్టీ వారైనా నిబంధనలను అతిక్రమించి కడుతున్నందున తనను కలవాల్సిందేనని ఆ ప్రజాప్రతినిధి సమాధానం ఇచ్చి ఫోన్ పెట్టేసినట్లు తెలిసింది.
- తెలుగుదేశం పార్టీకే చెందిన ఒక కిందిస్థాయి నేతపై ఆయన నిర్వహిస్తున్న మద్యం షాపునకు సంబంధించి వాటా కావాలని ఒక ప్రజాప్రతినిధి ఒత్తిడి తీసుకువచ్చారు. తాను ఎన్నికల సందర్భంగా కూడా పార్టీకి ఖర్చు పెట్టానని, అయినా డబ్బులు అడగడమేంటని ఆ నాయకుడు వాపోయారు.
- గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియం పాలకవర్గం ఎన్నికల్లో పశ్చిమ ఎమ్మెల్యే మాధవి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజా, మేయర్ కోవెలమూడి రవీంద్ర వర్గాలుగా బరిలో దిగాయి. కాంట్రాక్టుల దగ్గర నుంచి అన్ని పనులూ ప్రజాప్రతినిధులే చేసుకుంటున్నారని, తమకు న్యాయం చేయడం లేదని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారమే అండగా డీలర్ల దందా!

తాడికొండలో రేషన్ బియ్యం మాఫియా రెచ్చిపోతోంది. అధికార పార్టీకి చెందిన ఇద్దరు డీలర్ల హవా నడుస్తోంది. పౌర సరఫరాల శాఖ గోదాము మొదలు పంపిణీ వరకు వారి కనుసన్నల్లో అక్రమాలకు జోరుగా సాగుతున్నాయి. పేదల బియ్యంతో వారి జేబులు నింపుకొంటున్నారు.

- తాడికొండ మండలంలో పెట్రేగిపోతున్న రేషన్ మాఫియా
- నగదు ఇచ్చి నల్లబజారుకు యథేచ్ఛగా బియ్యం తరలింపు
- జేబులు నింపుకొంటున్న టీడీపీకి చెందిన ఇద్దరు డీలర్లు



రేషన్ బియ్యం సరఫరాలో గోల్‌మాల్

ఏప్రిల్ 1న 'సాక్షి'లో ప్రచురితమైన కథనం

తాడికొండ: వాస్తవంగా పౌర సరఫరాల శాఖ గోదాము నుంచి సరుకును రేషన్ డీలర్లకు తరలించాలంటే వేర్ హౌస్ గోదాముల నుంచి వచ్చిన బస్తాలను తూకం వేయాలి. అనంతరం డీలర్లకు తూకం వేసి, రేషన్ షాపుల వద్ద అప్పగించాల్సి ఉంటుంది. ఇక్కడ వచ్చిన సరుకును నేరుగా వాహనంలోకి ఎక్కించి తూకం వేయకుండానే డీలర్లను కాటాలో నిలబెట్టి తరలిస్తున్నారు. బస్తాకు 2 కేజీలకుపైగా బియ్యాన్ని మాయం చేస్తున్నారని డీలర్లు వాపోతున్నారు. ప్రశ్నించిన వారిపై తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

ఫిర్యాదులు ఇచ్చినా...

ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీన 'రేషన్ బియ్యం సరఫరాలో గోల్‌మాల్' పేరిట 'సాక్షి' దినపత్రికలో కథనం ప్రచురితం కాగా.. అధికారులు విచారణ చేశారు. సరుకులో కోత విధిస్తున్నారని పలువురు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు ఇచ్చినా బాధ్యులపై చర్యలు తీసుకోలేదు. మరుసటి నెల నుంచి గోదాము ఇన్‌చార్జి నేతృత్వంలో అదే తంతు కొనసాగుతోంది. ఓ వైపు డీలరుగా, మరోవైపు హమాలీగా విధులు నిర్వహిస్తున్న టీడీపీ వ్యక్తి నేతృత్వంలో గోదాములో జోరుగా రేషన్ బియ్యం వ్యాపారం కొనసాగుతోంది. తాడికొండలోని ఓ సీనియర్ నాయకుడికి అనుచరుడిని అని చెప్పుకొంటున్న మరో రేషన్ డీలరు ఏకంగా తానే రేషన్ డీలర్లకు అధ్యక్షుడినని పెత్తనం చెలాయిస్తుండటం గమనార్హం. 5 సంవత్సరాల నుంచి బియ్యం పంపిణీ చేస్తున్న పాయింట్ వద్ద సరుకు డెలివరీ ఇవ్వాలని, గతంలో పాడుబడిన భవనంలో ఉన్న పాయింట్ వద్ద పెడితే సరుకు ఇస్తామని అధికారులతో చెప్పించాడు. సరుకు డెలివరీ నిలిపి వేయించాడు. గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడి జోక్యం చేసుకున్నా గొడవలు ఎందుకంటూనే తన అనుచరుడికి మద్దతు ఇచ్చాడు. దీంతో బాధితుడు కేవలం 100 మీటర్ల దూరంలో ఉన్న పాడుబడిన భవనంలోకే సరుకు దించుకోవాల్సి వచ్చింది. వర్షం పడితే నీరు కారుతుందని మరో గదిలోకి మార్చడంతో తనను ఉద్దేశపూర్వకంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని డీలరు వాపోతున్నారు.

అనుకూలమైన వారికే స్టాకు

అధికార పార్టీ డీలరు ఏకంగా రెండో పాయింట్ ఏర్పాటు చేశాడు. లబ్ధిదారులకు నగదు ఇచ్చి ఇద్దరు డీలర్లు సరుకును నల్లబజారుకు తరలిస్తున్నారు. సీనియర్ నాయకుడి అండదండలు ఉన్నాయి. తూకంలో తేడాలు, అనుకూలమైన వారికి స్టాకు ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ఆర్డరు కాపీ పరిశీలిస్తా

దీనిపై పౌర సరఫరాల శాఖ డీటీ దేవరాజును వివరణ కోరగా... సదరు డీలరు రెండో పాయింట్ పెట్టుకునేందుకు ఆర్డీవో నుంచి అనుమతి తెచ్చుకున్నట్లు తనకు తెలిపాడన్నారు. అందుకు సంబంధించిన ఆర్డరు కాపీ తన వద్ద లేదన్నారు. తెప్పించుకొని పరిశీలిస్తానని పేర్కొన్నారు.

తండ్రి కల.. తనయుడి తపన

- తొలి ప్రయత్నంలోనే ఐఆర్ఎస్ సాధించిన తెనాలి వాసి
- నాలుగో ప్రయత్నంలో ఐపీఎస్
- ఐఏఎస్ లక్ష్యంగా విజయ్‌బాబు ప్రయాణం





తల్లిదండ్రులు, సోదరుడితో...

తెనాలి: నాన్న కల నిజం చేయాలని కుమారుడు పట్టుదలతో కృషి చేశారు. తొలి ప్రయత్నంలోనే 22 ఏళ్ల వయసులో ఐఆర్ఎస్ సాధించారు. తండ్రి కల అయిన ఐఏఎస్ కోసం మళ్లీ ప్రయత్నించారు. ఈసారి ఐపీఎస్ సాధించారు. మరోమారు ఐఏఎస్‌కు ప్రయత్నం చేస్తానని చెప్పారు.

తెనాలికి చెందిన దోనేపూడి విజయ్‌బాబు 2024 సివిల్స్ పరీక్షల్లో 681వ ర్యాంక్ సాధించారు. తుది ఫలితాల్లో ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. 2021లో ఐఆర్ఎస్‌కు ఎంపికై ప్రస్తుతం ఆదాయ పన్నుశాఖలో అసిస్టెంట్ కమిషనర్ (ఇన్వెస్టిగేషన్స్)గా విజయవాడలో బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. నాలుగో ప్రయత్నంలో ఇప్పుడు ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. విజయ్‌బాబు తండ్రి మధుబాబు, తల్లి రాజ్యలక్ష్మి. తల్లి గ్రాడ్యుయేట్ కాగా, తండ్రి ఎనిమిది పీజీలు చేశారు. జిల్లా కలెక్టర్‌గా చేయాలని ఆయన ఆశపడ్డారు. దిగువ మధ్యతరగతి కుటుంబం, ఆర్థిక సమస్యల నడుమ అవకాశం రాలేదు. జీఎస్టీ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న సమయంలో కన్ఫర్మ్‌డ్ ఐఆర్ఎస్ హోదా లభించింది. ఆ హోదాలోనే ఆయన రిటైరయ్యారు. తన కవల పిల్లలు అజయ్‌బాబు, విజయ్‌బాబులు ఐఏఎస్ సాధిస్తే చూడాలనేది మధుబాబు కల. చిన్ననాటి నుంచే మంచి విద్యాసంస్థల్లో చదివించారు. పోటీపరీక్షలకు ప్రోత్సహించారు.


చిన్ననాటి నుంచే...

2007లో నాలుగో తరగతి చదువుతుండగా విజయ్‌బాబు జిల్లాస్థాయి భగవద్గీత పోటీల్లో డిగ్రీ విద్యార్థులతో పోటీపడి బహుమతి సాధించారు. సంతోషించిన తాతయ్య ప్రభాకరరావు ఆశీర్వదిస్తూ 'భవిష్యత్‌లో కలెక్టరు కావాలి నాన్నా' అంటూ ఉత్తరం రాశారు. అప్పుడే విజయ్‌బాబు మనసులో ఆ పదం నాటుకుపోయింది. ఎదుగుతున్న క్రమంలో తండ్రి ఆశయం తెలిసింది. ఇక లక్ష్యం ఐఏఎస్‌గా ఫిక్సయ్యారు. టెన్త్‌లో 10 జీపీఏ సాధించారు. ఇంటర్‌లో స్నేహితులకు భిన్నంగా ఎంఈసీలో చేరారు. 'సివిల్స్ కొట్టాలంటే ఇంజినీరింగ్ చేయాలనే రూలేం లేదు... ఆర్ట్స్‌తోనూ సాధించొచ్చు' అని తండ్రి ఇచ్చిన సలహాను ఆచరణలో పెట్టారు. ఇంటర్‌లో 975 మార్కులతో రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించారు.

ఇంటి వద్దే సిద్ధమై...

డిగ్రీ కోసం ఢిల్లీలోని సెయింట్ స్టీఫెన్స్ కాలేజీని ఎంచుకున్నారు. 400 సీట్ల కోసం పోటీ పడిన 30 వేల మంది నుంచి ఆయన ఎంపికయ్యారు. 2019లో బీఏ ఆనర్స్‌ను ఫస్ట్ డివిజనులో ఉత్తీర్ణులయ్యారు. అదే ఏడాది జులైలో తెనాలికి వచ్చారు. అప్పటి నుంచి సివిల్స్‌పై గురిపెట్టారు. అవిశ్రాంత కృషితో 2021 సివిల్స్ పరీక్షలలో 682వ ర్యాంకుతో ఐఆర్ఎస్‌ను ఖాయం చేసుకున్నారు. అప్పటికి విజయ్‌బాబు వయసు 22 ఏళ్లు మాత్రమే. 2022 రెండోసారి రాసినా మళ్లీ ఐఆర్ఎస్ వచ్చింది. మూడో ప్రయత్నంలో తగిన ర్యాంకు రాలేదు. నిరుత్సాహం పడకుండా నాలుగో ప్రయత్నంలో ఐపీఎస్‌ను దక్కించుకున్నారు. నాన్న కలను నెరవేర్చాలని మరోమారు పరీక్షలకు హాజరుకానున్నారు.

కామన్ ఫెసిలిటీ సెంటర్‌కు స్థల పరిశీలన



పచ్చళ్ల తయారీ యూనిట్‌ను పరిశీలిస్తున్న బృందం

మోతడక (తాడికొండ): నేషనల్ లైవ్లీ హుడ్ మిషన్ నేతృత్వంలో కామన్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటుకు ఢిల్లీకి చెందిన కేంద్ర బృందం సభ్యులు తాడికొండ మండలం మోతడక గ్రామంలో బుధవారం పర్యటించారు. మహిళా సంఘాలు తయారు చేస్తున్న పచ్చళ్ల, కారంపొడులు తదితర యూనిట్లను పరిశీలించారు. అనంతరం బండారుపల్లి, నిడుముక్కల గ్రామాలలో పర్యటించారు. ఎంఎస్ఎంఈ కింద ఎస్ఆర్ఎల్ఎం నిధులతో పికిల్ హబ్ ఏర్పాటుకు గ్రామంలో 4 ఎకరాల్లో ప్లాటెడ్ ఫ్యాక్టరీతోపాటు కామన్ ఫెసిలిటీ హబ్‌ను రూ.20 కోట్లతో ఏర్పాటు చేసే దిశగా స్థల పరిశీలన చేసినట్లు ఏపీఎం సాంబశివరావు తెలిపారు. కార్యక్రమంలో సెంట్రల్ బృందం సభ్యులు అరవింద్ పటేల్, జనార్దన్, హైదరాబాద్‌కు చెందిన నేషనల్ లైవ్లీ హుడ్ సభ్యులు గోపాలకృష్ణ, డైరెక్టర్లు, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ టీవీ విజయలక్ష్మి, ఏపీడీలు కిరణ్ కుమార్, డీపీఎం అశోక్ కుమార్, తహసీల్దార్ మెహర్ కుమార్, ఏపీఎం సాంబశివరావు, సీసీలు సిబ్బంది పాల్గొన్నారు.

'చేనేత'కు అందని చేయూత

చేనేత వస్త్రాలు అంటే జాతీయ స్థాయిలో మంగళగిరికి పేరుంది. అగ్గిపెట్టెలో పట్టే చీరను తయారు చేసిన ఘనత మంగళగిరి నేతన్నలది. ఒకప్పుడు వెలుగు వెలిగిన చేనేత పరిశ్రమ నేడు సమస్యల్లో కొట్టుమిట్టాడుతోంది. ఒకప్పుడు జిల్లాలో 80 వేలకుపైగా ఉన్న మగ్గాలు నేడు 35 వేలకు తగ్గిపోయాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేనేత రంగాన్ని ఆదుకునేందుకు పలు పథకాలను ప్రవేశపెట్టింది. నేడు కూటమి ప్రభుత్వం వచ్చాక నేత కార్మికులను గాలికి వదిలేసింది.



గుంట మగ్గం నేస్తున్న కార్మికుడు

- నాడు కార్మికులకు అండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- కూటమి సర్కార్ వచ్చాక తప్పని అష్టకష్టాలు
- నేతన్నలను ఆదుకోవడంలో చంద్రబాబు అన్నివిధాలా విఫలం
- నేడు జాతీయ చేనేత దినోత్సవం



మంగళగిరి: నాడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మంగళగిరి అంటే చేనేత గుర్తుకు వచ్చేలా ముఖద్వారంలో నేతన్న విగ్రహం ఏర్పాటు చేశారు. చేనేత సెంటర్‌గా పేరుపెట్టారు. విజయవాడ వైపు నుంచి వచ్చే వారికి మంగళగిరి అంటే చేనేత అని గుర్తుకు వచ్చేలా ప్రకాశం బ్యారేజి వద్ద నేతన్న విగ్రహం ఏర్పాటు చేశారు. ప్రతి కార్మికుడుకి నెలకు రూ.రెండు వేలు చొప్పున ఏటా రూ.24,000 నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. జిల్లా వ్యాప్తంగా 3,500 కుటుంబాలు చేనేతపైనే ఆధారపడి జీవిస్తున్నాయి. నాడు రాజీవ్ గృహ కల్ప కాలనీ వద్ద చేనేత షెడ్లు నిర్మించారు. 146 మగ్గాలు ఉచితంగా అందజేసి సుమారు 1,500 కుటుంబాలకు ఉపాధి కల్పించారు. పాత బస్టాండ్ ప్రగడ కోటయ్య, వైఎస్సార్‌ల పేరిట ఆవరణలో చేనేత భవనాన్ని నాటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిర్మించింది. తెనాలి రోడ్డు విస్తరణలో దుకాణాలు కోల్పోయే వారికి చేనేత భవన్‌లో దుకాణాలు కేటాయించేలా ప్రణాళిక రూపొందింది.

నేడు అంతటా నిర్లక్ష్యమే

కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక చేనేత పరిశ్రమను పూర్తిగా విస్మరించింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేనేత భవన్ కట్టిందనే కక్షతో నేటికీ ప్రారంభించలేదు. దీంతో నేత దుకాణదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంగళగిరిలో గెలిచి మంత్రి అయిన నారా లోకేష్ ఇప్పటికీ చేనేత పరిశ్రమను పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ పరిశ్రమపై ఆధారపడి వేల కుటుంబాలు జీవనం కొనసాగిస్తున్నా ప్రభుత్వం విస్మరించింది. దీంతో వారు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కార్మికుడు గుంట మగ్గంలో నేయడానికి కూలీకి వెళ్తే రోజుకు రూ.250 మించి రావడం లేదు. వేసవికాలంలో రూ.150 కే ఈ మొత్తం పరిమితం. సుదీర్ఘకాలం పనిచేస్తే అనారోగ్యం పాలవుతున్నారు.

ప్రస్తుతం ఎవరూ పట్టించుకోవడం లేదు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నెలకు రూ.2 వేలు సాయంగా ఇచ్చేవారు. ఆరోగ్యం సరిగా లేక పనికి పోలేకపోయినా పూట గడిచేది. టీడీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ పథకాన్ని ఎత్తేయడంలో ఒక్క రోజు పనికి పోకున్నా పూటగడవని పరిస్థితి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే కార్మికుల కుటుంబాలు సంక్షేమ పథకాలతో సంతోషంగా జీవించేవి. ఇప్పుడు ఏ పూటకు ఆ పూట భయంగా బతకాల్సి వస్తోంది. ఎవరూ పట్టించుకోవడం లేదు.

– అడిగోపుల తారకేశ్వరి, చేనేత కార్మికురాలు

పూట గడవని దుస్థితిలో నేతన్నలు

చంద్రబాబు చేనేత పరిశ్రమకు, కార్మికులు మేలు చేస్తారని ఓటేశాం. మంత్రి లోకేష్ కూడా పట్టించుకోవడం లేదు. వైఎస్సార్ సీపీ పాలనలో నెలకు రూ.రెండు వేలు చొప్పున వచ్చేవి. బ్యాంకు ఖాతాలో నేరుగా జమ అయ్యేవి. కార్మికులు సంతోషంగా జీవించేవారు. నేడు ఏ రోజుకా రోజు పని చేస్తేనే పూట గడిచే దుస్థితిలోఉన్నారు. ప్రభుత్వం స్పందించాలి.

– వెంకటేశ్వరరావు, చేనేత కార్మికుడు

జాతీయ రహదారిపై లారీ దగ్ధం



లారీ నుంచి చెలరేగుతున్న మంటలు

మంగళగిరి టౌన్: విజయవాడ గుంటూరు జాతీయ రహదారిపై ఓ లారీ దగ్ధమైన ఘటన బుధవారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. మంగళగిరి నగర పరిధిలోని ఆత్మకూరు బైపాస్‌లో తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం ఎదురుగా జాతీయ రహదారిపై లారీలో మంటలు చెలరేగాయి. రోడ్డుపై మార్జిన్ పెయింట్ వేసేందుకు ఉపయోగించే లారీగా దీనిని గుర్తించారు. రహదారి పక్కనే ఆపిన లారీలో నుండి అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. దీంతో వాహనంలో ఉన్న నాలుగు సిలిండర్లు పేలడంతో మంటలు ఎక్కువయ్యాయి. పేలుడు శబ్దం ధాటికి సమీపంలో ఉన్న ప్రజలు, వాహన దారులు భయభ్రాంతులకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సకాలంలో చేరుకుని మంటలను అదుపు చేశారు. ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. మంటలు చెలరేగే సమయంలో భారీగా ట్రాఫిక్ ఆగిపోవడంతో మంగళగిరి రూరల్ పోలీసులు వచ్చి క్రమబద్ధీకరించారు.

9న మున్సిపల్ కార్యాలయాల ఎదుట టూల్‌డౌన్


సమావేశంలో పాల్గొన్న నాయకులు

మంగళగిరి టౌన్: మున్సిపల్ కార్మికుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి జీవో నంబరు 36పై స్పష్టమైన హామీ ఇవ్వాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్, వైఎస్సార్‌ట్రేడ్ యూనియన్ నేతలు డిమాండ్ చేశారు. మంగళగిరి నగర పరిధిలోని సీపీఐ కార్యాలయంలో బుధవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీన అన్ని మున్సిపల్ కార్యాయాల వద్ద టూల్‌డౌన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 36పై స్పష్టత ఇవ్వకపోవడం, అమలు చేయకపోవడంపై మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గండికోట దుర్గారావు, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ నియోజకవర్గ అధ్యక్షుడు రత్నాకరం శ్రీనివాసరాజు, పట్టణ వైఎస్సార్‌టీయూసీ అధ్యక్షుడు నక్క నాగరాజు, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు పెంచాలి


రాష్ట్ర అధ్యక్షుడు వి.రమేష్ బాబు

గుంటూరు మెడికల్: మున్సిపాలిటీ తరహా పారామెడికల్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు పెంచాలని పారా మెడికల్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.రమేష్ బాబు అన్నారు. ఆయన బుధవారం గుంటూరులో విలేకరులతో మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలో పారామెడికల్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు కీలక సేవలు అందిస్తున్నారన్నారు. తక్కువ జీతాలతో ఎక్కువ గంటలు పని చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధర్నా చేస్తేనే సమస్యలను పట్టించుకుంటారా? అని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జీతాలు పెంచాలని పేర్కొన్నారు. సీనియారిటీ ప్రకారం కాంట్రాక్ట్ విధానంలోకి మార్చాలని డిమాండ్ చేశారు. ముగ్గురు మంత్రుల కమిటీలోని తుది నిర్ణయాలు న్యాయం చేసేలా చూడాలని, లేదంటే ఉద్యమ బాట తప్పదని హెచ్చరించారు.

'విద్యా శక్తి'పై నిర్బంధం తగదు


డీఈవో రేణుకకు వినతి పత్రం సమర్పిస్తున్న ఫ్యాప్టో జిల్లా నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచి ప్రారంభించిన విద్యా శక్తి కార్యక్రమాన్ని నిర్బంధం చేయడం తగదని ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) జిల్లా చైర్మన్ కె.నరసింహారావు పేర్కొన్నారు. బుధవారం డీఈవో కార్యాలయంలో జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుకను కలిసిన నాయకులు తమ ఇబ్బందులను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ పలుచోట్ల విద్యాశక్తి కార్యక్రమాన్ని నిర్బంధంగా నిర్వహిస్తున్నారని అన్నారు. అలసిపోయిన విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహించడం వల్ల ప్రయోజనం ఉండదన్నారు. హెచ్‌ఎంలకు తగు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. డీఈవో మాట్లాడుతూ కార్యక్రమం నిర్బంధ కాదని, ఐచ్ఛికమేనని తెలిపారు. ఫ్యాప్టో జిల్లా డిప్యూటీ సెక్రటరీ జనరల్స్ యు.రాజశేఖర్‌రావు, డీకే సుబ్బారెడ్డి, ఎండీ ఖలీద్, జిల్లా కార్యవర్గ సభ్యులు తిరుమలేష్, ఎం.కళాధర్, డి.పెదబాబు, బాలాజీ, వై.శ్యాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే గ్రామాల్లో స్వచ్ఛత

జెడ్పీ సీఈవో వి. జ్యోతిబసు


తుమ్మలపాలెంలో సుప్రీం ఎల్‌టీసీలో నాడెప్ యూనిట్లను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసు, డీపీవో నాగసాయికుమార్ తదితరులు

ప్రత్తిపాడు: ప్రజల సహకారంతోనే గ్రామాల్లో స్వచ్ఛత సాధ్యపడుతుందని జెడ్పీ సీఈవో వి. జ్యోతిబసు అన్నారు. ప్రత్తిపాడు మండలం తుమ్మలపాలెంలోని సుప్రీం ఎల్‌టీసీలో బుధవారం హ్యాండ్స్ ఆన్ ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణకు గుంటూరు జిల్లాలోని 17 మండలాల ఎంపీడీవోలు, డెప్యూటీ ఎంపీడీవోలు హాజరయ్యారు. వారు ఆరు బృందాలుగా క్లాప్ మిత్రలతో కలిసి ఇంటింటికీ వెళ్లి తడి చెత్త, పొడి చెత్త సేకరణ విధానాలపై ఆరా తీశారు. మహిళలతో మాట్లాడారు. వ్యర్థాల నిర్వహణ, స్వచ్ఛ లక్ష్యాలను అనంతరం రచ్చబండ సెంటరులో ప్రజలకు వివరించారు. స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హ్యాండ్ వాష్ చేయించారు. తదనంతరం గ్రామంలోని సుప్రీం ఎల్‌టీసీని సందర్శించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో మాట్లాడుతూ గ్రామాల స్వచ్ఛతపై యంత్రాంగం పూర్తి స్థాయి దృష్టి కేంద్రీకరించాలని చెప్పారు. జిల్లా పంచాయతీ అధికారి బి.వి.నాగసాయి కుమార్ మాట్లాడుతూ తుమ్మలపాలెం పంచాయతీలో జరుగుతున్న అన్ని రకాల స్వచ్ఛతా కార్యక్రమాలు జిల్లాలోని అన్ని మండలాల్లో జరిగేలా ఎంపీడీవోలు, డెప్యూటీ ఎంపీడీవోలు చూడాలన్నారు. గుంటూరు డీఎల్‌పీవో శ్రీనివాసరావు గ్రామంలో విజయవంతంగా స్వచ్ఛతను అమలు చేస్తున్నారన్నారు. గ్రామ సర్పంచ్ చల్లా నాగమల్లేశ్వరి, కార్యదర్శి షేక్ ఖాజా, క్లాప్ మిత్రులను సత్కరించారు. ఎంపీడీవోలు, డెప్యూటీ ఎంపీడీవోలు, డీపీఆర్‌సి ప్రతినిధులు నిరంజన్, కరీముద్దిన్, అనురాధ, ఐటీసీ ఫినిష్ సొసైటీ కోఆర్డినేటర్ యశ్వంత్ శ్రీనివాసరావు, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

క్రైస్తవులపై అక్రమ కేసుల ఎత్తివేతకు డిమాండ్

నగరంలో క్రైస్తవ సంఘాల భారీ శాంతి ర్యాలీ



శాంతి ర్యాలీలో గుంటూరు మేత్రాసన పీఠాధిపతి డాక్టర్ చిన్నాబత్తిన భాగ్యయ్య తదితరులు

నెహ్రూనగర్: చత్తీస్‌గఢ్‌లో ఇద్దరు నన్‌లను అక్రమంగా అరెస్ట్ చేశారని, వారిపై అక్రమ కేసులను ఎత్తివేయాలని గుంటూరు మేత్రాసన పీఠాధిపతి డాక్టర్ చిన్నాబత్తిన భాగ్యయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు క్రైస్తవ, దళిత, బహుజన సంఘాల నాయకుల ఆధ్వర్యంలో బుధవారం ఏసీ కాలేజీ ఎదురుగా ఉన్న పునీత ఆగ్నేసమ్మ దేవాలయం నుంచి కలెక్టరేట్ వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మతమార్పిడుల పేరుతో సిస్టర్లను అన్యాయంగా అరెస్టు చేయడం దేశవ్యాప్తంగా ఉన్న క్రైస్తవులు వ్యతిరేకిస్తున్నారన్నారు. ఇలాంటి దాడులపై ఐక్యంగా ఉంటూ పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. బలవంతపు మత మార్పిడి ఎవరూ చేయరని, సమాజంలో అట్టడుగువర్గాల అభివృద్ధికి క్రైస్తవ మతం కృషి చేస్తుందన్నారు. వీసీకే రాష్ట్ర అధ్యక్షుడు ఎన్‌జే విద్యాసాగర్ మాట్లాడుతూ దేశంలో దశాబ్దాలుగా క్రైస్తవులపై దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. వారు కూడా భారతీయులేనని గ్రహించలేని స్థితిలో మతోన్మాదులు ఉన్నారని మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇకనైనా ఈ విషయంలో తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం డీఆర్‌ఓ ఖాజావలికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు గాబ్రియేల్, సహదేవ్, నెహెమ్యా, మార్కు, బాబురావు, సతీష్‌కుమార్, కిరణ్, రాజు, రేపూడి రాయప్ప, అబ్రహం, విజయ్‌పాల్, వివిధ సంఘాల నాయకులు నల్లపు నీలాంబరం, మద్దు ప్రేమజ్యోతిబాబు, డాక్టర్ కర్రా హనోక్ బెంజిమెన్, రత్నశ్రీ, జీఆర్ భగత్ సింగ్, జూపూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వలస కూలీల పిల్లలకు ప్రత్యేక బోధన

తాడికొండ: రాజధానిలో వలస కూలీల చిన్నారులకు ప్రత్యేక వసతులతో కూడిన బోధన అందించనున్నట్లు తుళ్ళూరు ఎంఈవో లక్ష్మీనారాయణ తెలిపారు. బుధవారం ఆర్‌వీఆర్ నిర్మాణ కంపెనీలో పర్యటించిన ఆయన 10 మంది చిన్నారులను గుర్తించి, అయ్యన్నచెరువులోని ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. కూలీ భాష, అవసరాన్ని బట్టి సీజనల్ హాస్టల్ ఏర్పాటు చేసి ప్రత్యేక విద్య అందించనున్నట్లు తెలిపారు. యూపీ, మధ్యప్రదేశ్, బిహార్, చత్తీస్‌గఢ్ నుంచి కూలీలు వచ్చారని పేర్కొన్నారు. సీఆర్‌డీఏ ఏడీసీఎల్ మార్స్ పీఆర్‌ఏ పుల్లయ్య పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ కేసుతో ఎంపీపీని వేధించడం దారుణం

యాదవ యువజన రాష్ట్ర అధ్యక్షుడు చింతలపూడి మురళీకృష్ణ

పొన్నూరు: కూటమి ప్రభుత్వం ప్రజా ప్రతినిధులపై అక్రమ కేసులు బనాయించి వేధింపులకు పాల్పడటం దారుణమని ఆంధ్రప్రదేశ్ యాదవ యువత రాష్ట్ర అధ్యక్షులు పొన్నూరు మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షులు చింతలపూడి మురళీకృష్ణ ఆరోపించారు. పెదకాకాని మండల పరిషత్ అధ్యక్షులు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు తుల్లిమిల్లి శ్రీనివాసరావుపై అక్రమ కేసుతో ఇబ్బందులకు గురిచేసిన ప్రభుత్వ చర్యలను ఖండించారు. ఎంపీపీ ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా జలకళ ద్వారా మండలంలో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారని అన్నారు. ఉద్దేశపూర్వకంగానే అక్రమంగా కేసు పెట్టి వేధిస్తున్నట్లు స్పష్టమవుతోందని వెల్లడించారు. అధికారులపై ఎలాంటి చర్యలు లేకుండా శ్రీనివాసరావుని మాత్రమే బాధ్యుడిని చేయడం దారుణమన్నారు. రాజకీయంగా అణచివేసే పన్నాగంలో భాగంగా బలహీన వర్గాలను టార్గెట్ చేసి వేధింపులకు గురిచేయడం హేయమైన చర్య అన్నారు. ఎమ్మెల్యే ప్రోద్బలంతోనే యాదవ కులానికి చెందిన వ్యక్తిని అరెస్టు చేయడం జరిగిందని ఆరోపించారు. రాష్ట్రంలోని యాదవులంతా ఒక్కటై కూటమిని శంకరగిరి మాన్యాలు పట్టిస్తామని అన్నారు. నిరాధారమైన ఆరోపణలతో ఎంపీపీపై పెట్టిన అక్రమ కేసును తీసివేసే వరకూ ఉద్యమిస్తామని కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

జ్వరంతో 'నారాయణ' విద్యార్థి మృతి

- కన్నీరుమున్నీరుగా విలపించిన తల్లిదండ్రులు



లక్ష్మీపురం: నారాయణ విద్యాసంస్థలో చదువుతున్న విద్యార్థి జ్వరంతో బుధవారం మృతి చెందాడు. వివరాలు.. ప్రకాశం జిల్లా, కొమరోలు మండలం, బోనపల్లె గ్రామానికి చెందిన ఏలూరి వెంకట సుబ్బయ్య, సువర్ణ దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు వెంకట నారాయణ(15), రెండో కుమారుడు దీక్షిత్‌లు గుంటూరులోని నారాయణ విద్యాసంస్థలో చదువుతున్నారు. వెంకట నారాయణ పలకలూరు క్యాంపస్‌లో పదో తరగతి, దీక్షిత్ పట్టాభిపురం ఐఐటీ క్యాంపస్‌లో పదో తరగతి చదువుతున్నారు. ఇద్దరు హాస్టల్‌లోనే ఉంటున్నారు. వెంకట నారాయణ వారం రోజుల నుంచి జ్వరంతో ఉండటంతో ఈ నెల 2వ తేదీన తల్లిదండ్రులు వచ్చి స్వగ్రామానికి తీసుకెళ్లి వైద్యం చేయించారు. సోమవారం పలకలూరులోని క్యాంపస్‌లో దిగబెట్టి వెళ్లారు. జ్వరం మళ్లీ రావడంతో మంగళవారం రాత్రి గుంటూరు గుజ్జనగుండ్లలో ఉండే మేనమామ మహేష్‌కు ఫోన్ చేయడంతో బుధవారం ఉదయం సుమారు 6.30 గంటలకు క్యాంపస్‌కు వచ్చి బాలుడిని గుజ్జనగుండ్లలోని తన సోదరి అనసూయ ఇంటికి తీసుకొచ్చారు. తర్వాత స్తంభాలగరువులోని ఎంజీఆర్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షలు చేస్తున్న సమయంలో వెంకట నారాయణ మృతి చెందాడు. మధ్యాహ్నం సుమారు 2.20 గంటల సమయంలో తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు వచ్చి మృతదేహం వద్ద కన్నీరు మున్నీరుగా విలపించారు. పోలీస్‌స్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదు చేయలేదు. మృతదేహాన్ని అంబులెన్స్‌లో జోరువానలోనూ స్వగ్రామానికి తీసుకెళ్లారు. ఏఐఎస్‌ఎఫ్ నాయకులు ఆస్పత్రికి చేరుకుని విద్యార్థి కుటుంబానికి అండగా నిలిచారు.

14 మంది బాల కార్మికులు గుర్తింపు

నెహ్రూనగర్: బాల కార్మికులను పనిలో పెట్టుకునే యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ ఎం.బాలు నాయక్‌తో కలిసి బుధవారం చిలకలూరిపేట రోడ్డులో మిర్చి గ్రేడింగ్ చేసే పాయింట్‌లో తనిఖీలు నిర్వహించారు. పని చేస్తున్న 14 మంది బాల కార్మికులను గుర్తించారు. ముగ్గురు యజమానులపై కేసులు నమోదు కోర్టులో ప్రవేశపెట్టారు. బాలలతో ఎక్కడైనా పని చేయిస్తున్నట్లు గుర్తిస్తే 94925 55144 ఫోను నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్ ఎ.గాయత్రీదేవి, అసిస్టెంట్ కమిషనర్ కె. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

మంగళగిరి టౌన్: తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి సూచించారు. మంగళగిరి నగర పరిధిలోని ఇందిరానగర్ యూపీహెచ్‌సీలో జరుగుతున్న తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డీఎంహెచ్‌వో విజయలక్ష్మి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఎ. శ్రావణ్ బాబు హాజరయ్యారు. ఎయిమ్స్ నర్సింగ్ విద్యార్థులు దృశ్య రూపకం ప్రదర్శించారు. తల్లులకు ప్రోటీన్ పౌడర్, పండ్లు, రాగి జావలను పంపిణీ చేశారు. యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి. అనూష, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీవో కె.సరిత, ఎయిమ్స్ సీఎఫ్ఎం హెచ్‌ఓడీ డాక్టర్ రాజీవ్, ఎయిమ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ముత్తు వెంకటాచలం, డాక్టర్ సుధీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భూ వరాహస్వామి జయంతి


ప్రత్యేక అలంకారంలో స్వామి వారు


దర్శించుకుంటున్న శ్రీ నారాయణ చరణ్ స్వామి బృందం

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై భూ వరాహస్వామి జయంతి ఉత్సవాలను వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆశ్రమ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి మంగళాశాసనములతో ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు ఈ జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మొదటి రోజు బుధవారం ఉదయం 9 గంటలకు శ్రీ భూవరాహ హోమం, అష్టోత్తర శతనామార్చన, పూర్ణాహుతి, వేద ఆశీర్వచనం నిర్వహించామని పేర్కొన్నారు. స్వామి నారాయణ సంస్థ నుంచి స్వామిజీ మహారాజ్ సేవకులు శ్రీ నారాయణ చరణ్ స్వామి బృందంతో విచ్చేశారన్నారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారని తెలిపారు.

సోషల్ మీడియా ఇన్‌చార్జి రాకేష్‌పై మరో అక్రమ కేసు

- కొనసాగుతున్న కూటమి సర్కార్ కక్ష సాధింపు
- మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు
- ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన రాకేష్‌పైనా అట్రాసిటీ కేసు బనాయింపు
- విచారణ అనంతరం రాకేష్‌కు 41ఏ నోటీస్ ఇచ్చిన డీఎస్పీ

సాక్షి ప్రతినిధి, గుంటూరు: రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం దుర్వినియోగం అవుతుందనడానికి నిదర్శనం రాకేష్ గాంధీపై మరో అక్రమ కేసే. ఎస్సీ, ఎస్టీలకు రక్షణగా ఉండాల్సిన అట్రాసిటీ చట్టం రాష్ట్రంలో విపక్షాల అణచివేతకు అస్త్రంగా మారింది. అధికార పార్టీకి వ్యతిరేకంగా గొంతెత్తినా, ప్రతిపక్షాలు రోడ్డెక్కినా.. అట్రాసిటీ కేసులతో అణచివేయాలని ప్రయత్నిస్తున్నారు. ఏకంగా ఎస్సీలపైనే అట్రాసిటీ కేసులు నమోదు చేసే స్థాయికి దిగజారుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు వ్యవస్థ అంత పతనమైంది. చట్టం దుర్వినియోగం అవుతోందని పలుసార్లు న్యాయస్థానాలు మొట్టికాయలు వేసినా తీరు మారటం లేదు. వివరాలు.. వైఎస్సార్ సీపీ చిలకలూరిపేట నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్‌చార్జి రాకేష్‌పై కూటమి ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 20 కేసులు నమోదు అయ్యాయి. సుమారుగా 50 రోజుల పాటు రిమాండ్‌లో ఉండి ఇటీవల జైలు నుంచి విడుదల అయ్యారు. రాకేష్‌పై మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఆత్మకూరుకు చెందిన సుకుమార్ 2024లో ఫిర్యాదు చేశారు. హోంమంత్రి వంగలపూడి అనితపై సోషల్ మీడియాలో అసభ్యకరమైన వ్యాఖ్యలు చేస్తూ ఫొటోలు మార్ఫింగ్ చేశారనే ఫిర్యాదు మేరకు మంగళగిరి రూరల్ పోలీసులు రాకేష్ గాంధీతో పాటు నిజామాబాద్‌కు చెందిన అశోక్ అనే మరో వ్యక్తి మీద కూడా కేసు నమోదు చేశారు.

తప్పించుకుని తిరుగుతున్నారట!

ఇప్పటి వరకు వీరిద్దరూ తప్పించుకుని తిరుగుతున్నారనే నెపంతో... రాకేష్ విడుదలైన వెంటనే ఈ కేసులో భాగంగా డీఎస్పీ కార్యాలయానికి బుధవారం పిలిపించారు. డీఎస్పీ కార్యాలయంలో రాకేష్‌ను విచారించిన అనంతరం 41ఏ నోటీసులు అందజేశారు. ఆ నోటీసులో దర్యాప్తునకు ఎలాంటి ఆటంకం కలిగించకుండా సహకరించాలని, ఫిర్యాదు ఇచ్చిన వారినిగానీ, వారి కుటుంబ సభ్యులుగానీ, సాక్షులుగానీ బెదిరించడం, ప్రలోభపెట్టడం చేయకూడదని పేర్కొన్నారు. అనుమతి లేకుండా ఇతర ప్రాంతాలకు వెళ్లకూడదని ఆ నోటీసులో తెలిపారు. ఇలా ఉంటే దళితుడైన రాకేష్‌పై ఏకంగా ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయడం గమనార్హం. రాకేష్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయలేదని, ఈ కేసులో అతడితోపాటు మరో వ్యక్తి ఉన్నాడని, అతడిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు అయిందని, ఇద్దరిలో ఒక్కరికే ఆ కేసు వర్తిస్తుందని పోలీస్ అధికారులే వ్యాఖ్యానిస్తున్నారు.

పొగాకు రైతులను బలి చేయొద్దు



ధర్నా నిర్వహిస్తున్న వి.కృష్ణయ్య తదితరులు

ఏపీ రైతు, కౌలు రైతు సంఘాల నాయకులు

కొరిటిపాడు(గుంటూరు): పొగాకు రైతులను బలి చేయొద్దని, ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మొత్తం కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం, ఏపీ కౌలు రైతు సంఘాల రాష్ట్ర కమిటీలు డిమాండ్ చేశాయి. సంఘాల ఆధ్వర్యంలో చుట్టుగుంట సెంటర్‌లోని వ్యవసాయ రాష్ట్ర కమిషనర్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీతో పొగాకు కొనుగోలు ఆపేస్తామని ప్రభుత్వం చేసిన ప్రకటన విరమించుకోవాలని పేర్కొన్నారు. 20 శాతం మాత్రమే కొన్నారని తెలిపారు. మిగతాదీ కొనకుంటే ఆందోళన తప్పదని హెచ్చరించారు. ధర కూడా తగినంత ఇవ్వడం లేదని చెప్పారు. నాణ్యత లేదని పొగాకు వెనక్కి పంపుతున్నారని మండిపడ్డారు. ప్రైవేట్ కంపెనీలతో కుమ్మక్కై కొనుగోలుదారులు బయ్యర్లు ధర లేకుండా చేస్తున్నారని పేర్కొన్నారు. ఏపీ కౌలురైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు మాట్లాడుతూ కొనుగోలు చేసిన పొగాకుకు సంబంధిత రైతులకు ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా జమ చేయలేదన్నారు. వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీ రావు అందుబాటులో లేకపోవడంతో మార్కెటింగ్ శాఖ రాష్ట్ర కమిషనర్ విజయ సునీతకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నల్లమడ సంఘం నాయకులు కొల్లా రాజమోహన్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కంచుమాటి అజయ్‌కుమార్, కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై. రాధాకృష్ణమూర్తి, నంద్యాల జిల్లా రైతు నాయకులు వెంకటేశ్వర గౌడ్, రైతు సంఘాల నాయకులు కొల్లి రంగారెడ్డి, పాడిబండ్ల కోటేశ్వరరావు, బండి శంకరయ్య, బిక్కి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కూటమికి బీసీలు అంటే అంత అలుసా?

- కూటమి ప్రభుత్వం బీసీలపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి
- వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు తాడిబోయిన వేణుగోపాల్ యాదవ్


ఎంపీ ఆళ్ళ అయోధ్యరామిరెడ్డి నివాసంలో మాట్లాడుతున్న నాయకులు

పెదకాకాని: కూటమి ప్రభుత్వం బీసీలపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు తాడిబోయిన వేణుగోపాల్‌యాదవ్ అన్నారు. పెదకాకానిలోని రాజ్యసభ సభ్యుడు ఆళ్ళ అయోధ్యరామిరెడ్డి నివాసంలో బుధవారం మండల ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు అక్రమ అరెస్టుపై విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు తాడిబోయిన వేణుగోపాల్‌యాదవ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో బీసీలే పార్టీకి వెన్నుముక అని ప్రచారం చేసే కూటమి ప్రభుత్వం బీసీలను కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తుందన్నారు. మూడు సంవత్సరాల కిందట జరిగిన జలకళ పథకంలో అక్రమాలు జరిగాయని ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావుకు గిట్టని వారితో ఫిర్యాదు చేయించి అరెస్టు చేయించడం ముమ్మాటికీ రాజకీయకక్షే అన్నారు. ఈనెల 3వ తేదీన ఓ దినపత్రికలో సీనియర్ ఎమ్మెల్యేపై ఆ ఎమ్మెల్యే దందాలతో దడ అని ప్రచురణ కావడంతో సీనియర్ ఎమ్మెల్యే ఎవరబ్బా అని రాజకీయ విశ్లేషకులు, ప్రజలు సందిగ్ధంలో ఉన్నారన్నారు. అదే సమయంలో ఆ ఎమ్మెల్యే ఎవరో ఆ పార్టీ నాయకులే విలేకరుల సమావేశం పెట్టడం, అదే పత్రికతో పాటు పలు పేపర్లలో ఈనెల 5వ తేదిన తక్కెళ్ళపాడు కల్యాణ మండపం వ్యవహారంలో ఎమ్మెల్యే నరేంద్ర తప్పేంలేదని ప్రచురించడం చూస్తే ఆ సీనియర్ ఎమ్మెల్యే ఎవరో సమాజానికి స్పష్టంగా తెలియజేశారన్నారు. ఈ వ్యవహారంపై ప్రజల ఆలోచన, రాజకీయ వర్గాల్లో జరుగుతున్న చర్చను ప్రక్కదారి పట్టించడానికే కూటమి ప్రభుత్వం ఎంపీపీని ఒక పథకం ప్రకారం అరెస్టు చేయించిందన్నారు. గతంలో అనుమర్లపూడిలో జరిగిన సంఘటన రోజు నుంచి ఎంపీపీపై ఎమ్మెల్యే కక్ష పెంచుకున్నాడని ఆరోపించారు. కేవలం రాజకీయకక్షతోనే ఎంపీపీని అక్రమంగా అరెస్టు చేయించారన్నారు. ఇటీవల కాలంలో పొన్నూరు రూరల్ మండలం, మన్నవ గ్రామ సర్పంచి బొనిగల నాగమల్లేశ్వరరావును కూడా రాజకీయ కక్షతో హత మార్చేందుకు ఎమ్మెల్యే అండదండలతో హత్యాయత్నం చేశారన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు బొల్లయదుల వెంకటేశ్వర్లు, పొన్నూరు నియోజకవర్గ బీసీసెల్ అధ్యక్షుడు కూరాకుల మత్యేశ్వరరావు, మండల రైతు విభాగం అధ్యక్షుడు ఆర్దల బ్రహ్మం, బిసి సంఘం నాయకులు వేల్పుల నాగరాజు, ఆలా శ్రీనివాసరావు(సఫారీబాబు), గుమ్మా సాయి, దానబోయిన నాగేశ్వరరావు, రామయ్య, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్ విడుదల

గుంటూరు మెడికల్: జిల్లా టీబీ కార్యాలయం పరిధిలో పలు పోస్టులను భర్తీ చేసేందుకు 2024 డిసెంబర్‌లో నోటిఫికేషన్ విడుదల చేశారు. దరఖాస్తు చేసుకున్నవారి ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్‌ను బుధవారం విడుదల చేశామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి తెలిపారు. లిస్ట్‌పై అభ్యంతరాలు ఉంటే ఆగస్టు 13వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు ఆధారాలతో లిఖిత పూర్వకంగా డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో తెలియజేయాలన్నారు. లిస్ట్‌ను గుంటూరు.ఏపీ. జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో బుధవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 1,500 గరిష్ఠం : రూ. 2,400

మోడల్ ధర రూ. 2,000

మిర్చి

యార్డు సమాచారం (బుధవారం ధరలు)



వచ్చిన బస్తాలు	50,597
అమ్మకాలు	49,084
నిల్వ	10,027

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-13,500
నంబరు-5	10,000-13,200
341	10,000-14,000

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-12,800
నంబరు-5	10,000-13,300
341	10,000-14,800
4848	10,000-12,500

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 14,000
బాడిగ-355	10,000 - 12,600
దేవనూరు డీలక్స్	10,000 - 12,400
ఆర్మూర్	9,800 - 11,000
తాలుకాయలు	5,000 - 7,000

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000-13,800
బాడిగ - 355	10,000-12,200
దేవనూరు డీలక్స్	10,000 - 12,300
తాలు	5,300 - 7,000

-కొరిటిపాడు (గుంటూరు)



పసుపు ధరలు (బుధవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 676

కొమ్ములు : 506 బస్తాలు (ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,700	10,600	10,100

కాయలు : 170 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,800	10,600	10,200

మొత్తం అమ్మకాలు : 507.00 క్వింటాళ్లు

-దుగ్గిరాల